సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

యోగాతో ఒత్తిడి దూరం



యోగా సాధన చేస్తున్న చిన్నారులు

మల్కాపురం: యోగా వల్ల ఒత్తిడి తగ్గి ఏకాగ్రత పెరుగుతుందని మల్కాపురం శాఖా గ్రంథాలయ అధికారి అజేయ్‌కుమార్ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం శిబిరంలో పాల్గొన్న చిన్నారులకు యోగాలో మెలకవులు నేర్పించారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు యోగాను నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. యోగా మంచి అలవాట్లకు, మానసిక ధైర్యంతో పాటు ఆత్మావిశ్వాసానికి అవసరం అన్నారు. కార్యక్రమం అనంతరం శిబిరంలో పాల్గొన్న చిన్నారులకు స్పోకెన్ ఇంగ్లిష్ , ఉద్యోగ నైపుణ్యాలపై యవజన నాయకులు కృపారాణి,శేషు,రామారావు,సుజన వివరించారు.

16, 17న తాగునీటి సరఫరాకు అంతరాయం

పెందుర్తి/దాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్–8 పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 16, 17 తేదీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ మురళీకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాయ్‌పూర్ నుంచి సబ్బవరం నేషనల్ హైవే నిర్మాణ పనుల్లో భాగంగా, అమృత్–2.0, 24/7 నీటి సరఫరా నెట్‌వర్క్ అభివృద్ధి పనులు చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పాపయ్యరాజుపాలెం, పురుషోత్తపురం, వేపగుంట ప్రాంతాల్లో వాటర్ ఫ్లో మీటర్స్ అమర్చేందుకు 24 గంటలు తాటిపూడి ప్రధాన పైప్‌లైన్ నీటి సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు. దీంతో ఈ నెల 16న ఉదయం 11.30 నుంచి 17న ఉదయం 11.30 గంటల వరకు పూర్తిగా మంచి నీటి సరఫరా ఉండబోదన్నారు. ఈ నేపథ్యంలో తాటిపూడి ప్రధాన పైప్‌లైన్ ఉన్న బల్క్ ఇండస్ట్రీస్ వినియోగదారులకు, జోన్–8 పరిధిలో ఉన్న వార్డు–93(పార్ట్) నుంచి వార్డు–98లో ఉన్న సాయిదుర్గానగర్, దుర్గానగర్, కృష్ణానగర్, అప్పలనరసింహం కాలనీ, హెచ్‌బీ కాలనీ, గోకులం కాలనీ, రెల్లివీధి, కృష్ణరాయపురం , గొల్లివిల్లివానిపాలెం, ఎల్‌ఐసీ కాలనీ, సుజాతనగర్, పాపయ్యరాజుపాలెం, పెందుర్తి పాత గ్రామం, తెలకలవీధి, ప్రశాంతినగర్, క్రాంతినగర్, వుడా కాలనీ, రైల్వే కాలనీ, సావిత్రినగర్, అప్పన్నపాలెం, సింహపురి లే అవుట్, అడవివరం, ఎస్సీ కాలనీ, పాత అడవివరం తదితర ప్రాంతాల్లో మంచి నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందన్నారు. ఆయా ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేయనున్నట్లు చెప్పారు.

రాజమాణిక్యం రచనలు స్ఫూర్తిదాయకం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏపీపీఎస్సీ చైర్మన్ అనురాధ

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.రాజమాణిక్యంను ఏపీపీఎస్సీ చైర్మన్ ఏ.ఆర్. అనురాధ అభినందించారు. రాజమాణిక్యం రచించిన 'షాడోస్ టు స్పాట్‌లైట్'(ద రైజ్ ఆఫ్ దళిత్ వాయిసెస్) పుస్తకాన్ని ఏపీపీఎస్సీ చైర్మన్ అనురాధ చేతుల మీదగా బుధవారం విజయవాడలో ఆవిష్కరింపజేశారు. సమాజంలో వెనుకబడిన వర్గాల ప్రాధాన్యతను గుర్తించాల్సిన అవసరాన్ని ఆచార్య రాజమాణిక్యం వెలుగులోకి తీసుకొచ్చేలా చేసిన రచనలు స్ఫూర్తిదాయకమన్నారు. గుర్రం జాషువా, రంగనాయకమ్మ రచనలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. విద్యా బోధనలో ఉంటూనే, సమాజ హితం కోరుతూ ఇలాంటి పుస్తకాలను రాయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాగార్జున యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ గుజ్జు చెన్నారెడ్డి, యోగి వేమన వర్సిటీ తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ రామ్ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులకు నెలవారీ వేతనాలు ఇవ్వాలి

విశాఖ విద్య: ఇంటర్మీడియట్‌లో గెస్ట్ ఫ్యాకల్టీకి జీతాలు పెంచినట్లు ఏయూలో అతిథి అధ్యాపకులకు కూడా యూజీసీ నిబంధనల మేరకు నెలవారీ వేతనాలు ఇవ్వాలని అతిథి అధ్యాపకుల అసోసియేషన్ నాయకులు వీసీని కోరారు. ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్ ఎక్స్‌లెన్స్ పురస్కారం అందుకున్న సందర్భంగా అతిథి అధ్యాపకులు వీసీని బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.



52వ వార్డు లలిత డిలైట్ వద్ద చదును చేయకుండా వదిలేసిన పార్కు

అభివృద్ధి పనులకు బ్రేక్!

- పార్కుల సుందరీకరణపై అలసత్వం
- కాంట్రాక్టర్లదే ఇష్టారాజ్యం
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

విశాఖ విద్య: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో శరవేగంగా సాగిన అభివృద్ధి పనులు ప్రస్తుతం నెమ్మదించాయి. నిధులు సకాలంలో ఇస్తారో..?లేదోనని బెంగతో కాంట్రాక్టర్లు పనుల స్పీడు తగ్గించారు. మరో వైపు జీవీఎంసీ అధికారులు సైతం అభివృద్ధి పనులపై పర్యవేక్షణ అంతంతమాత్రంగానే చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. జీవీఎంసీ 52వ వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులు ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. జియ్యాని శ్రీధర్ డిప్యూటీ మేయర్‌గా వ్యవహరించిన సమయంలో కౌన్సిల్ ఆమోదంతో అధికారుల సహకారంతో వార్డులో అభివృద్ధి పనుల కోసం పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయించారు. ఈ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు మొదట్లో స్పీడుగానే చేసినా, ప్రస్తుతం వారిలో నిర్లిప్తత నెలకొంది. డిప్యూటీ మేయర్ పదవి నుంచి శ్రీధర్ వైదొలగడంతో అప్పట్లో కేటాయించిన నిధులు సవ్యంగా, సకాలంలో మంజూరవుతాతాయా.. లేదా? అనేసందేహంలో పడ్డారు. ఈ నేపథ్యంలోనే పనుల స్పీడు తగ్గించారనే ప్రచారం సాగుతోంది. దీంతో ప్రజలకు మౌలిక వసతుల పెంపు కోసం చేపట్టిన పనులు సకాలంలో పూర్తికాని పరిస్థితి నెలకొంది.

పార్కుల అభివృద్ధిలోనూ అదే తీరు

52వ వార్డులో ప్రజానీకానికి ఆహ్లాదకరమైన వాతావరణం అందించేలా పార్కుల సుందరీకరణకు శ్రీధర్ అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఎన్ఏడీ ఫ్లైఓవర్ మొదలుకొని లలిత డిలైట్ వరకు జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న గ్రీన్ బెల్ట్‌ను పార్కుల మాదిరి అభివృద్ధి చేయాలనే సంకల్పంతో శ్రద్ధ తీసుకొని నిధులు కేటాయింపు చేయించారు. అయితే గ్రీన్ బెల్ట్ అభివృద్ధి పనులు చాలా చోట్ల అసంపూర్తిగానే మిగిలాయి. లలిత డిలైట్ వద్ద పచ్చని షేడ్ గ్రాస్(గడ్డి)పేర్చి నగరంలోని మోడల్ పార్కుగా తీర్చిదిద్దాలని భావించినా, పనులు మాత్రం అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. పార్కును పూర్తి స్థాయిలో చదును చేయకుండానే హడావుడిగా గడ్డి పేర్చారు. విద్యుత్‌దీపాల ఏర్పాటు కోసం చేసిన ఏర్పాట్లు ఇంకా పునాదుల దశలోనే ఉన్నాయి. ఇంజినీరింగ్ అధికారులు పనులపై పర్యవేక్షణ చేయకపోవడంతో కాంట్రాక్టర్లు నచ్చినప్పుడే చేస్తామనే ధరోణిలో ఉన్నారు.



ఇంకా పునాదుల దశలోనే



అరకొరగా వేసిన షేడ్ గ్రాస్

నిలిచిన రహదారి పనులు

52వ వార్డులోనే కాదు, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న పశ్చిమనియోజకవర్గంలోని అన్నివార్డుల్లోనూ ప్రస్తుతం రహదారుల అభివృద్ధి పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. 52వ వార్డులో కరాస, గణేష్ నగర్‌లో రోడ్డునిర్మాణానికి కౌన్సిల్ ఆమోదం తెలిపినా, పాలక మండలి మారడంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు. నియోజకవర్గంలో చాలా చోట్ల ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం పేదల కాలనీల్లో మౌలిక సౌకర్యాల కల్పనను పట్టించుకోకపోవడంతో అధికారుల్లో అలసత్వం నెలకొందనే విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి టెండరు షెడ్యూల్ మేరకు గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజానీకం కోరుతున్నారు.

ప్రజా సమస్యలపై పోరాడుదాం

- జీవో 30 కింద ఒక్క పట్టా అయినా ఇచ్చారా ?
- వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు రేవళ్ల



మాట్లాడుతున్న రేవళ్ల సత్యనారాయణ

మల్కాపురం: అంతా ఐకమత్యంతో వార్డులోని ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుదాం అని 59వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ పిలుపునిచ్చారు. వార్డు స్థాయి ముఖ్య నాయకులు,కార్యకర్తలు,బూత్ కమిటీ ప్రతినిధులతో బుధవారం ఆయన సమావేశం అయ్యారు. మాజీ సైనికకాలనీ వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే టిడ్కో ఇళ్లు ఇస్తామని ఎన్నికల్లో కూటమి నాయకులు హామీ ఇచ్చారని వివరించారు. అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా నేటికి ఆ హామీ అమలు కాలేదన్నారు.అలాగే సూపర్ సిక్స్‌లో ఏ ఒక్క హామీ నెలబెట్టుకోలేకపోయారని విమర్శించారు.కూటమి నాయకులకు ప్రజలను నమ్మించి మోసం చేయడం తప్పా,ఇచ్చిన మాటకు కట్టుబడటం చేతకాదన్నారు.జీవో నెంబర్ 30 ద్వారా పేదలకు ఇంటి పట్టాలు, 296 జీవో ద్వార అర్హులకు పట్టాల రిజిస్ట్రేషన్ చేస్తామని నెలలు గడుస్తున్నా ఒక్క పట్టా ఇంత వరకు మంజూరు చేయలేదని విమర్శించారు. వార్డు స్థాయిలో ఏ చిన్న ప్రజా సమస్య అయినా పార్టీ తరఫున వెళ్లి బాధితులకు అండగ నిలుద్దామన్నారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త,మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ ఆదేశాల మేర జరిగిన సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు పెంటారావు,ఎదురు సత్యనారాయణ,సంపత్‌కుమార్,భూపతినాయుడు,లోపింటి రమణ,అర్జున్,కృష్ణ,సరోజ,లక్ష్మి,నందిని,ప్రసాద్,డేవిడ్,మల్లేశ్వరరావు,వెంకినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న బాలికలు, తల్లులు

సింథియా: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతకు చెక్ పెట్టవచ్చునని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి అన్నారు. జీవీఎంసీ 62వ వార్డు పరిధి హరిజనవీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం సృజన వెల్ఫేర్ అసోసియేషన్ ప్రాజెక్ట్ అధికారులు జ్యోతిశ్రీ, అనుశ్రావణి ఆధ్వర్యంలో పిల్లల్లో రక్తహీనతను తగ్గించడానికి ఎలాంటి పౌష్టికాహారం ఇవ్వాలలో అవగాహన కల్పించారు. డాక్టర్ నాన్సీ ఆరోగ్యంగా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఐరన్ రిచ్ ఫుడ్ ఎగ్జిబిషన్‌లో తల్లులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటి ముగ్గురిని ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యయుడు హరికృష్ణ, శ్రీలక్ష్మి, కుమారి, దివ్య , బాలింతలు పాల్గొన్నారు.

ఎర్నిమాంబ వార్షిక జాతరకు ఏర్పాట్లు



అమ్మవారి జాతర కరపత్రాన్ని అవిష్కరిస్తున్న ఈవో సురేష్‌బాబు తదితరులు

కంచరపాలెం: జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి వార్షిక జాతరకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో డి.వి.ఎస్. సురేష్ బాబా తెలిపారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాలు ఈ నెల 14 నుండి 18 వరకు శోభాయమానంగా జరుగుతాయని, పందిరిరాటతో అమ్మవారి వార్షిక జాతర ఉత్సవాలు మొదలైనట్లు తెలిపారు. 15వ తేదీ ఉదయం 9 గంటలకు అచ్చియ్యమ్మపేట, జ్ఞానాపురం గ్రామాల ప్రజలచే అమ్మవారికి నీలధార సమర్పణ కార్యక్రమం జరుగుతుందని, సాయంత్రం 5 గంటల నుంచి హరికథా కాలక్షేపం ఉంటుందన్నారు. 16వ తేదీ అమ్మవారికి మూలమంత్ర హవనములు, సాయంత్రం కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు. 17వ తేదీ తొలేళ్ల ఉత్సవంలో అమ్మవారి ప్రతిమలను పూర్ణామార్కెట్ సమీపంలోని దుర్గాలమ్మ గుడి నుండి కొబ్బరితోట, అచ్చియ్యమ్మపేట, కాన్వెంట్ కూడలి మీదుగా జ్ఞానాపురంలో గల అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకొస్తామని చెప్పారు. 18న జరిగే ప్రధాన జాతరలో ఉత్సవ మూర్తికి పంచామృతాభిషేకాలు, విశేష కుంకుమార్చన, వివిధ పుష్ప జాతులతో అలంకరణ, ఉచిత ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అనంతరం అమ్మవారి జాతర ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ, పూజారి వాసుపల్లి విజయమ్మ, గ్రామ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహా అన్న సమారాధన



అన్నదానం చేస్తున్న గ్రామ కమిటీ సభ్యులు

కంచరపాలెం: వివేకానందవీధిలోని పాత్రపిల్లి అచ్చిబాబు కమ్యూనిటీ హాల్లో గొల్లకంచరపాలెం గ్రామదేవత దుర్గాదేవి జాతరలో భాగంగా మహా అన్న సమారాధన నిర్వహించారు. వివేకానంద గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని గ్రామాధ్యక్షుడు పల్లా అప్పారావు ప్రారంభించారు. సుమారు 3 వేల మందికి అన్నదానం చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో నమ్మి నాని యాదవ్, నమ్మి నాగేంద్ర, నంబారి వీరినాయుడు, పాత్రపిల్లి వెంకటరావు, నమ్మి శంకర్, బొట్టా శ్రీను, పల్లా వెంకటేశ్వరరావు, గ్రామ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌కు స్వస్తి చెప్పండి

- ఏఎంహెచ్‌వో సునీల్
- పలు దుకాణాల్లో నిషేధిత ప్లాస్టిక్ గుర్తింపు



ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

మల్కాపురం: ప్లాస్టిక్ కవర్ల వాడకం వల్ల పర్యావరణానికి హాని కలుగుతుంది..అంతా క్లాత్, పేపర్ బ్యాగులనే వాడాలని జోన్–5 అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ సూచించారు. జీవీఎంసీ 58,60వ వార్డుల్లోని పలుదుకాణాల్లో బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. శ్రీహరిపురం,గుల్లలపాలెం ప్రాంతాల్లో నిర్వహించిన సోదాల్లో 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ఆ కవర్లను స్వాధీనం చేసుకుని దుకాణాల యజమానులకు జరిమానాలు విధించారు.డాక్టర్ సునీల్ మాట్లాడుతూ నగరాన్ని మనమంతా సురక్షితంగా కాపాడుకోవాలంటే పాలిథిన్ వినియోగానికి స్వస్తి చెప్పాలన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల లాభాలు కంటే,నష్టాలు ఎక్కువ అని వివరించారు. నిషేధిత పాలిథిన్ వినియోగం వల్ల ఎలాంటి నష్టం ఉంటుందో అవగాహన కల్పిస్తున్నా వినియోగించడం దారుణమన్నారు. ఇకపై నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని.. ఎవరు వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మలేరియా విభాగ అధికారి డి.రవికుమార్,శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సునీల్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

- ఇష్టానుసారంగా స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు
- అదుపు తప్పుతున్న ద్విచక్ర వాహనాలు
- తొలగించాలని డిమాండ్



పాతరామాలయం వీధి వద్ద స్పీడ్ బ్రేకర్ | పాఠశాల సమీపంలో అదుపు తప్పిన ద్విచక్ర వాహనం

నరకానికి నకళ్లు!

వేగాన్ని నియంత్రించేందుకు వేసిన స్పీడ్ బ్రేకర్లు వాహనదారులకు ముప్పుగా మారాయి. ప్రమాణాలు పాటించకుండా వీధుల్లో ఎవరికి తోచిన విధంగా వారు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. వీటిని గమనించక రాత్రి వేళ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ద్విచక్రవాహనాలు అదపు తప్పుతున్నాయి. పలువురు గాయాల పాలుకావడానికి కారణంగా నిలుస్తున్నాయి.

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల నుంచి పాత రామాలయం మీదుగా గుల్లలపాలెం వరకు ఇటీవల సీసీ రోడ్డు వేశారు. దీంతో వాహనదారులు సంతోషించారు. అంత వరకూ బాగానే ఉన్న కొంతమంది యువత వాహనాలను రయ్‌రయ్ నడపడంతో స్థానికులు కలవరపాటుకు గురయ్యారు. రోడ్డు కష్టాలకు చెక్ పడిందన్న సంతోషం ఉంటే.. వీరు ఇరుకులో కూడా వేగంగా నడపడంతో భయపడిన కొందరు తమ ఇళ్ల ముందు నిర్ధిష్ట ప్రమాణాలు పాటించకుండా ఎత్తుగా స్పీడ్ బ్రేకర్లు వేయించారు. దీంతో వాహనాలు అదవుతప్పి ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

సొంత ఆలోచనల వల్లే

స్పీడ్ బ్రేకర్లు ట్రాఫిక్ అధికారుల అనుమతితో పాటు వారి సూచనల మేరకు వేయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ వేసిన స్పీడ్ బ్రేకర్‌లు 7 నుంచి 10 అంగుళాల ఎత్తుతో వేశారు.దీంతో ఆ స్పీడ్ బ్రేకర్లు దాటి వెళ్లే సమయంలో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ఆదివారం ఈ మార్గాన శ్రీనివాసరావు అతని బంధువుతో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తున్నప్పుడు జీవీఎంసీ పాఠశాల వద్ద స్పీడ్ బ్రేకర్‌ను దాటలేక అదుపు తప్పి పడి గాయపడ్డాడు. అలాగే ఇదే ప్రాంతానికి చెందిన భార్యాభర్తలు మార్కెట్ చేసుకుని తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో పాతరామాలయం వద్ద గల స్పీడ్ బ్రేకర్‌ను తప్పించే సమయంలో అదుపు తప్పి కిందపడ్డారు. రాత్రి సమయంలో ఈ మార్గాన విద్యుత్ సౌకర్యం అంతంత మాత్రంగా ఉండడంతో వీటిని గుర్తించలేక పలువురు గాయపడుతున్నారు. అధికారులు స్పందించి పరిమితి ఎత్తుతో కూడిన బ్రేకర్స్‌ను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంది



ఈ మార్గాన వస్తున్నప్పుడు స్పీడ్ బ్రేకర్లను తప్పించలేక చాలా ఇబ్బంది పడుతున్నాం. వాహనాల వేగాని తగ్గించేందుకు వేసిన స్పీడ్ బ్రేకర్ల మాదిరిగా లేవు. తమను గాయపరచడానికి వేసినట్టు ఉన్నాయి. అధికారులు వీటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలి.

– పైలా శంకరరావు, ద్విచక్ర వాహనదారుడు

అంత ఎత్తు ఎందుకో..



ఇక్కడ వేసిన స్పీడ్ బ్రేకర్లు చాలా ఎత్తుగా వేశారు. వాటిని దాటించే సమయంలో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. పూల వ్యాపారం చేసుకొనేందుకు ద్విచక్ర వాహనంపై వస్తున్నప్పుడు స్పీడ్ బ్రేకర్ దాటించే సమయంలో అదుపు తప్పాను. బ్యాలెన్స్ కాసుకోవడంతో ప్రమాదం తప్పింది. –నారాయణ, పూల వ్యాపారి

ఆశ్రమం నుంచి కుటుంబం చెంతకు



కుటుంబ సభ్యుల చెంతకు చేరిన హసన్

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం షెల్టర్‌లో ఆశ్రయం కల్పించిన వ్యక్తిని బుధవారం వారి కుటుంబసభ్యుల చెంతకు చేర్చారు. హసన్ అనే వ్యక్తి 8 నెలల కిందట గాజువాకలోని బస్‌షెల్టర్ లో ఉండడం గమనించి బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత షెల్టర్‌కి తీసుకువచ్చి ఆశ్రయం కల్పించారు. అతని మానసిక పరిస్థితి బాగోకపోవడంతో వైద్యం అందించి కోలుకున్న తర్వాత కుటుంబ సభ్యులు వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని రామగుండం దగ్గర అయోధ్యనగర్ అని చెప్పడంతో హసన్‌ను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఏడాది కిందట తప్పిపోయిన హసన్ తమ వద్దకు చేరడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. మమతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం జరిపారు.


40వ వార్డులో ఏఎంహెచ్‌వో విస్తృత పర్యటన



ఇండియన్ ఆయిల్ పరిశ్రమ వద్ద ఉన్న ప్రధాన గెడ్డను పరిశీలిస్తున్న డాక్టర్ సునీల్

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం జోన్–5 ప్రజారోగ్యశాఖ సహాయ వైద్యాధికారి సునీల్ సంబంధిత అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పరిశ్రమ వద్ద ప్రధానగెడ్డను, అలాగే మల్కాపురం పోలీస్‌స్టేషన్ సమీపంలోని ప్రధాన గెడ్డతో పాటు పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల నివాసితులు వ్యర్థాలను గెడ్డల్లో పేరుకుపోవడంతో పూడికలు పేరుకుపోయి చిన్నపాటి వర్షానికే మురుగు నీరు రహదారులపైకి వస్తుందన్నారు. దీని వల్ల పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. కొంతమంది తమ గృహాల్లో వ్యర్థాలను పారిశుధ్య కార్మికులకు అందించకుండా గెడ్డల్లో వేయడం సమంజసం కాదన్నారు. అలాంటి వారి వల్ల దోమలు, అపరిశుభ్రవాతావరణం ఏర్పడి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఇక గెడ్డల్లో వ్యర్థాలు వేస్తున్న సమయంలో ఎవరు చూసిన కనీస బాధ్యతగా ఫొటో, వీడియో తీసి దగ్గరలోని శానిటేషన్ అధికారులకు పంపించి స్వచ్ఛతకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పోర్టు పెన్షనర్ల హర్షం



మాట్లాడుతున్న చౌదరి అప్పారావు

మల్కాపురం: పోర్టు, డీఎల్‌బీ పెన్షనర్లకు 2022–25 వరకు గల ఏరియర్స్‌ను చెల్లించినందుకు పోర్టు పెన్షనర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం 51వ వార్డు కళింగనగర్‌లో విశాఖపట్నం హార్బర్ అండ్ పోర్టు పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ అధ్యుడు చౌదరి అప్పారావు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు ఈసందర్భంగా చౌదరి అప్పారావు మాట్లాడుతూ ముందుగా బకాయిలు చెల్లించినందుకు పోర్టు చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పెన్షనర్లకు సరైన వైద్యం అందడం లేదని, నాసిరకమైన మందులు ఇస్తున్నారని అన్నారు. పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రిని ప్రైవేట్‌పరం చేస్తున్నారని, తక్షణమే ఆ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పులి శివప్రకాష్‌రావు, పెన్షనర్లు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ వెస్ట్

9912222753, 9705933394

Office mail : sakshiadvtvsp@gmail.com